# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 26-09-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1. మానవ అక్రమ రవాణా కట్టడికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హోంశాఖ మంత్రి వి.అనిత తెలిపారు.**

**2. రాష్ట్రంలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు.**

**3. రాష్ట్రంలో పీజీ వైద్య విద్య క్లినికల్ విభాగంలో ఇన్‌సర్వీస్ కోటాను మరో ఐదు శాతం పెంచుతామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు.**

**4. వరదలకు దెబ్బతిన్న వాహనాల బీమాను పొందేలా అక్టోబర్ 1 నుంచి 7వ తేదీ వరకు విజయవాడలో ఇన్సూరెన్స్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వెల్లడించింది.**

**5. ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి ఈరోజు.**

==========================

మానవ అక్రమ రవాణా కట్టడికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వి.అనిత తెలిపారు. సైబర్ ఆధారిత మానవ అక్రమ రవాణాపై ఈరోజు నిర్వహించిన సదస్సులో మంత్రి పాల్గొని, మాట్లాడుతూ..

..వాయిస్.. 33 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. నెల్లూరులో ఈ రోజు నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, స్వదేశీ దర్శన్.. ప్రసాద్ వంటి కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా రేపు విజయవాడలో జరిగే కార్యక్రమంలో పర్యాటక రంగ అభివృద్ధికి సేవలందించిన వారికి పురస్కారాలను అందిస్తామని చెప్పారు. నెల్లూరు, తిరుపతి, కోనసీమ, శ్రీశైలం, విశాఖపట్నం, విజయవాడ వంటి ప్రాంతాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి చర్యలు తీకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రంలో పీజీ వైద్య విద్య క్లినికల్ విభాగంలో ఇన్‌సర్వీస్ కోటా కింద ప్రస్తుతం ఉన్న 15% ప్రవేశాల కేటాయింపునకు అదనంగా మరో ఐదు శాతం పెంచుతామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యాలయంలో పీహెచ్‌సీ వైద్య సంఘం ప్రతినిధులతో నిన్న సమావేశమయ్యారు. అనంతరం ప్రభుత్వ నిర్ణయాలను మంత్రి పాత్రికేయలకు వెల్లడించారు.వైద్యుల సమస్యలను పరిష్కరించే విషయంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. జీఓ 85ను సవరిస్తామని, ప్రస్తుతం ఆరు స్పెషాలిటీలకు పరిమితం చేసిన 15శాతం ప్రవేశాలను 20 శాతానికి పెంచుతామని చెప్పారు. 19 రకాల స్పెషాలిటీల్లో ప్రవేశాలు పొందేందుకు అవకాశాన్ని కల్పిస్తామని, భవిష్యత్తులో ఇన్‌సర్వీస్ కోటా కేటాయింపులపై సంఘం ప్రతినిధులతో చర్చించిన అనంతరమే నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పకృతి వనరుల సంరక్షణకు చర్యలు తీసుకుంటోదని రాష్ట్రసూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. అమెరికాలో పర్యటిస్తున్న మంత్రి ఈరోజు న్యూయార్క్‌లో ప్రపంచ బ్యాంకు నీటి వనరుల పరిరక్షణ ప్రాజెక్ట్ ప్రతినిధి మైక్ వెబ్‌స్టర్‌తో సమావేశమయ్యారు. వరదలు, కరవు నివారణకు ప్రకృతి ఆధారిత పరిష్కారాలపై ఈ సమావేశంలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌లో వరదలు, కరవు నివారణ కోసం రాష్ట్రప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మైక్ వెబ్‌స్టర్ హామీ ఇచ్చారని మంత్రి తెలిపారు. అలాగే వ్యవసాయ రంగంలో సౌరశక్తి వినియోగాన్ని పెంచడం, ఆవిష్కరణలు వంటి అంశాలపై షెల్ ఫౌండేషన్ ముఖ్యకార్యనిర్వహణాధికారి జోనాథన్ బెర్మాన్‌తో సమావేశమై చర్చించినట్లు మంత్రి వివరించారు.

---------------------------

విజయవాడలో బుడమేరు వరదలకు దెబ్బతిన్న వాహనాల బీమాను పొందేలా సత్వర పరిష్కారానికి వచ్చే నెల 1 నుంచి 7వ తేదీ వరకు విజయవాడలో ఇన్సూరెన్స్ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ వెల్లడించింది. వరదలకు వాహనాలు దెబ్బతిన్న వారందరూ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి ఎం.బబిత ఒక ప్రకటనలో కోరారు. హైకోర్టు, న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

---------------------------

స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా తిరుపతి నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఈ రోజు 3కె పరుగును నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, నగర కమిషనర్ ఎన్.మౌర్య ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. స్వచ్ఛత హి సేవలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు.

---------------------------

జాతీయవాది, దేశభక్తుడు, ప్రముఖ రచయిత చిలకమర్తి లక్ష్మీనరసింహం జయంతి ఈరోజు. 1867వ సంవత్సరం సెప్టెంబరు 26వ తేదీన ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లా-ఖండవల్లి గ్రామంలో ఆయన జన్మించారు.లక్ష్మి నరసింహం, సంఘసేవతో పాటు 'దేశమాత', 'మనోరమ', 'సరస్వతి' వంటి పత్రికలను స్థాపించి వాటిని సాంఘిక, రాజకీయ చైతన్య అస్త్రాలుగా వినియోగించి స్వాతంత్ర్యోద్యమం పట్ల ప్రజలను జాగృతం చేశారు. పత్రికా

నిర్వహణతో పాటు పలు రచనలు చేశారు. ఆయన రచించిన "గయోపాఖ్యానము" నాటకం, "గణపతి నవల" బహుళ ప్రాచుర్యం పొందాయి. సామాజిక పరిణామాలను చరిత్రకారుడుగా తన రచనల్లో పొందుపరిచిన చిలకమర్తి లక్ష్మీనరసింహం 1946 జూన్ 17వ తేదీన తన 79వ ఏటా కన్నుమూశారు.

---------------------------

ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా స్వచ్ఛ భారత్ సాధ్యమవుతుందని శ్రీకాకుళం శాసనసభ్యులు జి. శంకర్ అన్నారు. స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలోని భాగంగా ఈ రోజు శ్రీకాకుళంలో నాగావళి నది పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి తో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ, నదుల పరిశుభ్రత పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నాగావళి వంశధార నదుల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలుపుతూ,

వాయిస్ ( 25 సెకన్లు)

---------------------------

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రహదారి నిర్మాణ పనులను చేపట్టనున్నామని చిత్తూరుజిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. చిత్తూరు కలెక్టర్ కార్యాలయంలో రహదారి పనుల పురోగతిపై కలెక్టర్ ఈ రోజు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2024-25 సంవత్సరానికి గానూ జిల్లాకు మంజూరైన 1142 సిసి రహదారుల నిర్మాణ పనులను వచ్చే నెల 10వ తేదీ లోపు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

తిరుపతి జిల్లాలో పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. జిల్లాలోని మన్నవరం బెల్ పరిశ్రమను శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డితో కలిసి ఆయన ఈరోజు ఉదయం పరిశీలించారు. అనంతరం బెల్ పరిశ్రమ అధికారులతో సమావేశమై ప్రాజెక్టు విస్తరణ, భూ అవసరాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న బెల్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్- ఎన్.బి.పి.పి.ఎల్. పరిశ్రమను విస్తరించనున్నామని అన్నారు. అలాగే బెల్ పరిశ్రమలో 650 ఎకరాలు పైగా స్థలం ఉందని.. ఆ స్థలాన్ని ఇతర పరిశ్రమల ఏర్పాటుకు వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

---------------------------

దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ లో జరుగుతున్న ట్రాఫిక్ బ్లాక్ పనుల కారణంగా పలు రైళ్లను పాక్షికంగా రద్దు చేయడంతో పాటు కొన్ని రైళ్లను దారి మళ్లించి నడపనున్నట్లు విజయవాడ డివిజన్ పౌర సంబంధాల అధికారి నుస్రత్ మండ్రుప్కర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ – మచిలీపట్నం, విజయవాడ – భీమవరం జంక్షన్, విజయవాడ నర్సాపూర్, రైళ్లు ఈ నెల 30 నుంచి అక్టోబర్ 27వ తేదీ వరకు రామవరప్పాడు విజయవాడ మధ్య పాక్షికంగా రద్దు చేశామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 16 మంది ఐపీఎస్ అధికారులు బదిలీ చెస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. శాంతిభద్రతల ఐజీగా సిద్ధార్థ్ కౌశల్, ఇంటలిజెన్స్ ఎస్పీగా ఫకీరప్ప, అనకాపల్లి ఎస్పీగా తుహిన్ సిన్హా, అవినీతి నిరోధక శాఖ ఐజీగా వినీత్ బ్రిజ్‌లాల్, పీ అండ్ ఎల్ ఐజీగా రవిప్రకాష్, ఇంటలిజెన్స్ ఐజీగా పీహెచ్డీ రామకృష్ణ, రహదారి భద్రత డీఐజీగా విజయరావు, విశాఖ శాంతి భద్రతల డీసీపీగా మేరి ప్రశాంతి, కాకినాడ ఏపీ ఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక, ఒంగోలు పోలీస్ ట్రైనింగ్ ప్రిన్సిపాల్‌గా రాధిక నియమిస్తూ ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

======================